క్లుప్తంగా

బహుమతుల ప్రదానం

ఆత్మకూరు: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం పాఠశాల హెచ్ఎం మంజులవాణి బహుమతులు అందజేశారు.ఆమె మాట్లాడుతూ జనవరిలో భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జీవితచరిత్రపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు చెప్పారు. ఇందులో పావని, కుమారస్వామి, చిన్నమధు, సురేఖ తదితరులు బహుమతులు అందుకున్నారు.

కాశీవిశ్వేశ్వరుడికి వెండి ముఖావళి బహూకరణ



పగిద్యాల: మహిమాన్వితుడైన పడమర ప్రాతకోట కాశీవిశ్వేశ్వరస్వామికి గుంటూరు జిల్లా రిటైర్డ్ వ్యవసాయ సంచాలకులు వెండి ముఖావళిని బహూకరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు అంబటి శివశంకర్‌రెడ్డి, ఆలయ పూజారి జగదీశ్వరయ్య సోమవారం తెలిపారు. ప్రాతకోట గ్రామానికి చెందిన జయచంద్ర గుంటూరు జిల్లా వ్యవసాయ సంచాలకులుగా ఆరేళ్ల క్రితం పదవీ విరమణ పొందారు. కాశీశ్వరస్వామిపై భక్తిశ్రద్ధలతో రూ. 1.50 లక్షల విలువ చేసే వెండి ముఖావళిని ఆలయానికి బహూకరించారు.ఈయన గతంలో రూ. 2 లక్షల విలువ చేసే పూజా సామగ్రి, నాగాభరణం ఆలయానికి వితరణగా అందజేశారు. భక్తిని చాటుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు దాత అయిన జయచంద్రను ఘనంగా శాలువాతో సత్కరించి అభినందించారు.

15న టాలెంట్ టెస్ట్

ఆత్మకూరు: పట్టణంలోని థెరిస్సా కళాశాలలో ఈ నెల 15న 10 వ తరగతి విద్యార్థులకు ట్యాలెంట్ టెస్ట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షుడు చలపతి, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి దినేష్ కుమార్ తెలిపారు. సోమవారం ట్యాలెంట్ టెస్ట్ సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. వివరాలకు సెల్ 6303261839 కు సంప్రదించాలని కోరారు.

బాధితురాలికి ఆర్థిక సాయం

ఆత్మకూరు: పట్టణంలోని అర్బన్‌కాలనీలో ఇటీవల గ్యాస్ సిలెండర్ పేలిన సంఘటనలో గుడిసె దగ్ధమై నష్టపోయిన బాధితురాలి కుటుంబ సభ్యులకు ఆ కాలనీకి చెందిన సలాం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తమ కాలనీలో నిరుపేద కుటుంబానికి చెందిన ఈరమ్మ మహిళ పూరిగుడిసె దగ్ధం కావడంతో బొమ్మలు, నిత్యావసర సరుకులు కాలిపోయాయన్నారు.

మందులతో కుష్టు రోగాన్ని నివారించొచ్చు

ఆత్మకూరు: కుష్టువ్యాధి అంటే భయపడాల్సిన అవసరం లేదని మందుల ద్వారా దీనిని నివారించవచ్చని కుష్టు వ్యాధి నివారణ అధికారి నారాయణరావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీకళాశాలలో సోమవారం కుష్టువ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుష్టు వ్యాధి సోకితే చర్మంపై స్పర్శలేని మచ్చలు, కనుబొమ్మలు మరియు, కనురెప్పలు రాలిపోవడం తదితర లక్షణాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకట నరసయ్య, వైస్ ప్రిన్సిపల్ తిరుపతమ్మ, పద్మావతి, శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాసవీసత్రం అధ్యక్షుడిగా దేవకి వెంకటేశ్వర్లు



దేవకి వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న సభ్యులు

శ్రీశైలం: ప్రముఖపుణ్యక్షేత్రాల్లో ఆర్యవైశ్య వాసవీ నిత్యాన్నదానసత్రాల సముదాయాలకు అధ్యక్షుడిగా దేవకివెంకటేశ్వర్లు రెండో సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ కార్యనిర్వాహక సభ్యులు స్థానిక ఆర్యవైశ్య పట్టణ సంఘం వారు సోమవారం ఆయనను సన్మానించారు. శ్రీశైలంతోపాటు కాశీ, పుట్టపర్తి, తిరుపతి, తిరుమల, విజయవాడ, షిర్డీలలో వాసవీ నిత్యాన్నదాన సత్రాలు భక్తులకు సేవలను అందిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి సిద్ధా నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు అయితా మార్కండేయులు పాల్గొన్నారు.

ఆర్జీఎం యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

జూపాడుబంగ్లా: విద్యార్థి మృతికి కారణమైన పాణ్యం సమీపంలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసు కోవాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు ఆది డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నందికొట్కూరు పట్టణంలో మాట్లాడుతూ ఆర్జీఎం కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థి అజ్మతుల్లా యాజమాన్యం ఒత్తిడికి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతదేహాన్ని మార్చురీలో వదిలేసి చేతులు దులుపుకోవడం యాజమాన్యం రాక్షసత్వానికి నిదర్శనమన్నారు. రాంబాబు, సాయిప్రకాశ్, మద్రిస్వామి, గణేష్, జగదీష్ పాల్గొన్నారు.



పాదయాత్రగా తరలివస్తున్న శివస్వాములు, భక్తులు



శ్రీశైల క్షేత్రం భక్తజనసంద్రం

శివోహం

- ఇలకైలాసంలో ఆధ్యాత్మిక సంబరాలు
- బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు తరలివస్తున్న భక్తజనం
- ఓంకార నాదంతో.. మారుమోగుతున్న శ్రీగిరులు
- స్వామిఅమ్మవార్లను దర్శించి తరిస్తున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: ఎక్కడ చూసినా శివనామస్మరణ, శివభజనలు భక్తుల ఆధ్యాత్మికంగా పూజాధికాలతో ఇలకైలాసమైన శ్రీగిరి ఆధ్యాత్మిక సంబరాలు కొనసాగుతున్నాయి. అత్యంత వైభవంగా జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను కనులారా తిలకించి స్వామిఅమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకోవాలని భక్తజనం తండోపతండాలుగా శ్రీగిరికి చేరుకుంటున్నారు. ఓంకార నాదంతో శ్రీగిరులు మారుమోగుతున్నాయి.

భారీగా తరలివచ్చిన భక్తులు

శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో మూడవరోజు సోమవారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం స్వామిఅమ్మవార్ల దర్శనానికి బారులు దీరారు. భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేసింది. ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామిఅమ్మవార్లను దర్శించుకుంటున్నారు. శివదీక్షా భక్తులకు ప్రత్యేకంగా చంద్రవతి కల్యాణ మండపం నుంచి క్యూలైన్ ఏర్పాటు చేశారు. జ్యోతిర్ముడి కలిగిన శివదీక్షా భక్తులకు సమయానుకూలంగా మల్లన్న స్పర్శదర్శనానికి అవకాశం కల్పిస్తున్నారు. క్యూలైన్లలో వేచిఉన్న భక్తులు అల్పాహారం, మంచినీరు, బిస్కెట్లు, అందజేస్తున్నారు. భక్తుల రద్దీతో ఆలయ క్యూలైన్లన్నీ నిండిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, దేవస్థాన ఈఓ ఎస్.లవన్న ఎప్పటికప్పుడు క్యూలైన్లను పర్యవేక్షిస్తున్నారు.

ఉచిత దర్శనానికి 3 గంటలు

ఉచిత దర్శనానికి 3గంటల సమయం, శీఘ్ర దర్శనానికి గంట సమయం పడుతుంది. భక్తుల రద్దీతో ఆలయ ప్రధానవీధులన్నీ కళకళలాడుతున్నాయి. దీంతో శ్రీశైల క్షేత్రంలో బ్రహ్మోత్సవ సందడి నెలకొంది. క్షేత్రపరిధిలో పలుచోట్ల భక్తులు, శివస్వాములు పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు, భజనలు చేస్తూ క్షేత్ర ఆధ్యాత్మిక శోభ మరింత పెంచుతున్నారు.

నల్లమల అడవుల్లో ఓంకార నాదం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పలువురు భక్తులు పాదయాత్రగా తరలివస్తున్నారు. శివమాల స్వీకరించిన భక్తులే కాకుండా సాధారణ భక్తులు సైతం వెంకటాపురం నుంచి పాదయాత్రగా శ్రీశైలం చేరుకుంటున్నారు. నల్లమల అటవీప్రాంతంలో భక్తులు శివనామస్మరణ చేసుకుంటూ తమ పాదయాత్రను సాగిస్తున్నారు. దీంతో నల్లమల అటవీప్రాంతంలో ఓంకారనాదం ప్రజ్వలిస్తుంది.



స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రదక్షిణను ప్రారంభిస్తున్న ఈఓ, ధర్మకర్తల మండలి చైర్మన్



ఉత్సవంలో కళారూపం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు స్వామి, అమ్మవార్లకు హంసవాహన సేవ నిర్వహించారు. ఉత్సవంలో కళాకారుల ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.



మహిళల కోలాటం

వైద్యానికి సాయం

పగిద్యాల: కొన్ని రోజులుగా అనారోగ్యం బారిన పడి మంచానికే పరిమితమైన కొత్త ముచ్చుమర్రి గ్రామ ఎలక్ట్రిషియన్ అనిల్ వైద్యం నిమిత్తం రాష్ట్ర శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించి మానవతను చాటుకున్నారు. సోమవారం గ్రామ మాజీ సర్పంచ్ బోయ మద్దిలేటి అనిల్‌ను పరామర్శించి శాప్ చైర్మన్ పంపిన నగదు సాయాన్ని అందజేశారు. అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు బోయ సత్యం, మధు, రాంబాబు, రాజు తదితరులు ఉన్నారు.

ఆత్మకూరులో చోరీ

ఆత్మకూరు: పట్టణంలోని స్వరాజ్‌నగర్‌లోని డాక్టర్ నాగరాజు ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. కుటుంబ సభ్యుల తెలిపిన మేరకు వివరాలు.. నాగరాజు కుటుంబ సభ్యులు 2 రోజుల క్రితం బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి సోమవారం వచ్చేసరికి ఇంటి బయట తలుపులు, తాళం పగిలి ఉండటం, ఇంట్లోని బీరువాలోని దుస్తులు చెల్లాచెదురుగా పడడాన్ని గమనించారు. అనంతరం లోపలికి వెళ్లి పరిశీలించగా 4 తులాల బంగారు గొలుసు, రూ.40 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ కృష్ణమూర్తి సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

శివస్వాములకు అల్పాహారం

పాములపాడు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలదీక్ష చేపట్టి శ్రీశైలం పాదయాత్రగా వెళ్లే శివస్వాములకు అల్పాహార భిక్షను ఏర్పాటు చేశారు. గురువారం పాములపాడులోని శ్రీ లక్ష్మీ మినీరైస్‌మిల్లు అధినేత జనార్దన్ గుప్తా దంపతులు మిల్లు ఆవరణలో దాదాపు 2000 మందికి ఉగ్గాని, బజ్జీలను అందజేశారు. వీరు గతేడాది కూడా అల్పాహార శిబిరాన్ని నిర్వహించారు.

ప్రముఖులకు మహానంది ఉత్సవ ఆహ్వానం

మహానంది: మహానందిలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని సోమవారం పలువురు ప్రముఖులకు ఆహ్వానపత్రికలు అందించినట్లు ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని, సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడులు నంద్యాలకు వెళ్లి ప్రముఖులను కలిశారు. అందులో భాగంగా ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ నిశాంతిలకు ఆహ్వానపత్రికలు అందించారు. అలాగే మహాశివరాత్రి తెప్పోత్సవం దాత ఎజీఎస్ జ్యువెలర్స్ అధినేత అవ్వారు గౌరీనాథ్, కల్యాణోత్సవ దాత కూరగాయల ప్రసాద్, రామకృష్ణ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి తదితరులకు ఆహ్వాన పత్రికలు అందించారు.



జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌కు ఆహ్వానపత్రిక ఇస్తున్న చైర్మన్, ఈఓలు

సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగించాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న భువనేశ్వర్‌రెడ్డి

వెలుగోడు: బంజారాలు తమ సంస్కృతి సంప్రదాయాలను ఆచరించాలని, వాటిని మరిచిపోకుండా ముందు తరాలకు కానుకగా ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి అన్నారు. గుంతకందాల గ్రామపంచాయతీలోని తండాలో సేవాలాల్ మహారాజ్ 284 జయంతిని సోమవారం గిరిజనులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలవేసి భోగ్ బండారో వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నంద్యాల బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని భువనేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, వైస్ ఎంపీపీ శంకర్ నాయక్, నాయకులు దేశం తిరుపంరెడ్డి, ఇలియాస్ ఖాన్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి విక్రమ సింహ నాయక్, సుధాకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఈ–కేవైసీ చేయించుకోవాలి

జూపాడుబంగ్లా: రబీ సీజన్ పంటలను ఈక్రాప్ నమోదు చేయించుకున్న రైతులు ఈనెలాఖరులోగా తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని నందికొట్కూరు ఏఓ శ్రావణి తెలిపారు. సోమవారం ఆమె మండలంలోని దామగట్ల, బ్రాహ్మణకొట్కూరు, బొల్లవరం గ్రామాల్లోని ఆర్బీకేలను పరిశీలించారు. అలాగే ఈక్రాప్ బుకింగ్ నమోదుకు సంబంధించిన సూపర్‌చెకింగ్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో 12,200 ఎకరాల్లో 3,700 మంది రైతులు రబీ సీజన్‌లో పలురకాల పంటలు సాగు చేసినట్లు తెలిపారు. వందశాతం మేర రైతులు ఈక్రాప్ నమోదు చేసుకున్నప్పటికీ 1,323 మంది రైతులు మాత్రమే ఈ–కేవైసీ పూర్తిచేయించుకున్నట్లు తెలిపారు.

అన్నిదానాల్లో అన్నదానం మిన్న

జూపాడుబంగ్లా: అన్నిదానాల్లో అన్నదానం గొప్పదని నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం నందికొట్కూరు పట్టణంలోని జమ్మిచెట్టు వద్ద పాదయాత్రికుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పాండురంగడు, రాధాకృష్ణ అనే వ్యక్తులు 15ఏళ్లుగా మహాశివరాత్రికి కాలినడకన శ్రీశైలం వెళ్లే భక్తులకు అన్నదానం చేస్తూ తరించటం అభినందనీయమన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఒక్కరూ దాన గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు దేశెట్టి శ్రీనివాసులు, శ్రీకాంత్‌గౌడు, బజాజ్ రంగస్వామిగౌడు, జయన్న, బొట్టురవి తదితరులు పాల్గొన్నారు.



శివస్వాములకు భోజనం వడ్డిస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

అభివృద్ధి పనులపై దృష్టి సారించాలి

పగిద్యాల: ప్రభుత్వ అభివృద్ధి పనులపై దృష్టి సారించి లక్ష్యాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ వెంకటరమణ క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఎంపీడీఓ అధ్యక్షతన క్షేత్రస్థాయి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఉగాది నాటికి జగనన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని, లబ్ధిదారులతో ముఖాముఖి చర్చించి టార్గెట్‌లను పూర్తి చేయాలని సూచించారు. మనబడి నాడు నేడు పథకం కింద మండల వ్యాప్తంగా రెండవ, మూడవ విడుతల్లో జరిగే పాఠశాలల అదనపు గదులు, అంగన్‌వాడీ కేంద్ర భవనాల పనులను వేగవంతం చేయించాలని ఇంజినీరింగ్ సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుభాన్, మండల ఇంజినీర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఏఈ జ్యోతి తదితరులు ఉన్నారు.

మూర్ఛతో విద్యార్థికి అస్వస్థత

జూపాడుబంగ్లా: స్థానిక గురుకుల పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం విద్యార్థులు భోజనం చేసేందుకు క్యూలో నిల్చొని ఉండగా భువనచంద్ర అనే విద్యార్థి అకస్మాత్తుగా కింద పడి పోవటంతో ఏం జరిగిందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు హడలిపోయారు. భువనచంద్ర అనే విద్యార్థి పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ఇతనికి ఫిట్స్ రావటంతో అకస్మాత్తుగా కిందపడి పలకుండా ఉండిపోయాడు. వెంటనే తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు సపర్యలు చేసిన అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యులు డాక్టర్ సబా, డాక్టర్ గంగాధర్ అతన్ని పరీక్షించి ప్రాథమిక చికిత్సలు నిర్వహించారు. అనంతరం వైద్యులు గురుకుల పాఠశాలలో మెడికల్ క్యాంపు నిర్వహించి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ విజయలక్ష్మమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సబా

సమస్యల పరిష్కారానికే స్పందన

కొత్తపల్లి: గ్రామాల్లోని వివిధ సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్పందన కార్యక్రమం నిర్వహిస్తుందని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ద్వారా ఎన్నో ఏళ్లనుంచి తీరని సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు.

అధికారులు డుమ్మా

జూపాడుబంగ్లా: మండల స్థాయిలో 26 శాఖల అధికారులుండగా తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో నిర్వహించే కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్, స్పందన కార్యక్రమానికి కేవలం 10 శాఖలలోపు అధికారులు మాత్రమే హాజరయ్యారు. వారు కూడా అటెండెన్స్ రిజిష్టర్‌లో సంతకాలు పెట్టి మమ అనిపించి వెళ్తున్నారు. అధికారులు ఇలా మొక్కుబడిగా స్పందన కార్యక్రమంలో పాల్గొంటుండటంతో ప్రజలు వారి సమస్యలను మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తే తమ సమస్యలు పరిష్కారం కావనే ఉద్దేశంతో వ్యయ, ప్రయాసాలకోర్చి జిల్లా కేంద్రమైన నంద్యాలలో కలెక్టర్ అధ్వర్యంలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి వెళ్లి కలెక్టర్ ఎదుట వారి సమస్యలను మొరపెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది.

నట్టల నివారణ మందు పంపిణీ

పాములపాడు: మండంలోని తుమ్మలూరు గ్రామంలో పాడి రైతులకు పశువైద్యులు అనిల్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. పోషకాహార లోపంతో తలెత్తే సమస్యలు, నట్టల నివారణ లాంటి సమస్యలపై చేపట్టవలసిన చర్యల గురించి పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఐదు పాడి పశువులకు చికిత్స, రెండు చూడీ పశువులకు హిమోగ్లోబిన్ నిర్వహించి మినరల్ మిక్చర్, కాల్షియం టానిక్‌లను అందజేశారు.

శ్రీశైలానికి బయలుదేరిన శివస్వాములు

మహానంది: ఓం నమఃశివాయ...హరహర మహాదేవా శంభో శంకరా...అంటూ శివనామస్మరణతో ఎం.తిమ్మాపురం గ్రామం మారుమోగింది. వందలాది సంఖ్యలో శివదీక్షా స్వాములు సోమవారం శ్రీశైలం క్షేత్రానికి బయల్దేరి వెళ్లారు. అంతకు ముందు శివాలయంలో శ్రీ పార్వతీసమేత పరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించి ఇరుముడి స్వీకరించి ప్రయాణం ప్రారంభించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



విద్యార్థులకు వండిన అన్నాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ పుల్లయ్యయాదవ్

జూపాడుబంగ్లా: విద్యార్థులు భోజనం చేసే పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే వారికి రోగాలు రావా? అంటూ తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ వార్డెన్ గిరిధర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సోమవారం జూపాడుబంగ్లా గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన వాష్ బేషిన్‌లను చూసి దుర్వాసన వస్తుండటంతో వార్డెన్‌పై మండిపడ్డారు. అనంతరం విద్యార్థులకు వండిన ఆహారపదార్థాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. నిల్వ ఉంచిన వేరుశనగ విత్తనాలు పుచ్చుపట్టి ఉండటం, అరటిపండ్లు నాసిరకంగా ఉండటాన్ని గమనించి ఇలాంటి పదార్థాలతో భోజనం వండిపెట్టడం పద్ధతి కాదని మందలించారు. పాఠశాలలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు నిత్యం మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంటు శ్రీరంగారెడ్డి, గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల గుర్తింపు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పగిద్యాల: వచ్చే నెల 13న జరిగే పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికల ఓటింగ్‌కు రెండు పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు తహసీల్దార్ భారతీ తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు గదులను గుర్తించి నంబర్లు కేటాయించారు. రూమ్ నంబర్ 3లో పట్టభద్రులు, రూమ్ నంబర్ 12లో ఉపాధ్యాయులు ఓట్లు వేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పోలింగ్ ప్రక్రియకు అనుకూలమైన ఈ గదుల్లో విద్యుత్ సదుపాయం, ఫ్యాన్‌లు, కిటికీలు, వెలుతురు సదుపాయాలను పర్యవేక్షించారు. ఎంపీడీఓ వెంకటరమణ, సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్వో నాగన్న తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

జూపాడుబంగ్లా: మార్చి 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అనవరమైన పోలింగ్ కేంద్రం ఏర్పాటు కోసం సోమవారం మోడల్‌స్కూల్‌ను తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ పరిశీలించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్ పాఠశాలలోని 10వ తరగతి గదులు పోలింగ్ కేంద్రాల నిర్వహణకు అనువుగా ఉంటాయని తహసీల్దార్‌కు గదులు చూపించారు. గదుల్లో గాలి, వెలుతురు, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు వంటివి పరిశీలించారు. ఇప్పటికే మోడల్‌స్కూల్లో పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపించారు.

పల్లకీలో మహానందీశ్వరుడి విహారం

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగా, శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులు సోమవారం రాత్రి పల్లకీలో కొలువై విహరించారు. ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు పల్లకీసేవ వైభవంగా జరిగింది. సోమవారం కావడంతో మహానంది క్షేత్రం భక్తులతో కళకళలాడింది. వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి,అమ్మవార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. కార్యక్రమాల్లో ఆలయ సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ హరినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.



స్వామివారి పల్లకోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

వైద్యశిబిరాల ఆకస్మిక తనిఖీ

ఆత్మకూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పాదయాత్రగా తరలివెళ్లే శివస్వాముల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్యశిబిరాలను జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ జగదీష్ చంద్రారెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాగలూటి, బైర్లూటి, పెచ్చెర్వు, వెంకటాపురం, ఆత్మకూరు పరిధిలోని ప్రత్యేక వైద్యశిబిరాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు 24 గంటలు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో బైర్లూటి వైద్యాధికారులు గోపాల్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నాగలూటి క్షేత్రంలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న నంద్యాల జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ జగదీష్‌చంద్రారెడ్డి

నిందితుల అరెస్టు

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణంలోని బైరెడ్డినగర్ కాలనీకి చెందిన షేక్‌చాంద్‌బీ ఈనెల 7న ఉరివేసుకొని మృతిచెందిన విషయం విధితమే. ఆమె మృతికి కారణమైన భర్త న్యామత్‌ఖాన్, మామ నజీర్, మరిది ఫిరోజ్‌లను సోమవారం ఎస్ఐ ఎన్వీ రమణ అ రెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరుపర్చగా న్యా యమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన

కొత్తపల్లి: డిజిటల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ మోసాలపై దుద్యాలలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కర్నూలు వారి ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏపీజీబీ మేనేజర్ శ్రీనాథ్ మాట్లాడుతూ ప్రజలు డిజిటల్ లావాదేవిలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్ఎస్‌టీ కౌన్సిలర్‌లు కె.రాజు, శివనాగరాజు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు

ఆత్మకూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని వెంకటాపురం, నాగలూటి, బైర్లూటి గ్రామాల్లో ఎంపీడీఓ మోహన్‌కుమార్, డీఎల్‌పీఓ కవితల ఆధ్వర్యంలో సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఆమె మాట్లాడుతూ భక్తులకు, శివస్వాములకు ఇబ్బందులు లేకుండా పారిశుద్ధ్య పనులు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

మిడుతూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో మంగళవారం మండల అధ్యక్షురాలు మల్లు వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి సోమవారం తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

రేపు జూపాడుబంగ్లా మండల సమావేశం

జూపాడుబంగ్లా/పాములపాడు: ఈనెల 15న జూపాడుబంగ్లా, 16న పాములపాడు మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓలు మంజులవాణి, సుమిత్రమ్మ తెలిపారు. సమావేశానికి మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండలస్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

జూపాడుబంగ్లా: పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారంగా నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని వడ్డించాలని సర్పంచ్ మాధవరం ప్రకాశం ఆదేశించారు. సోమవారం ఆయన పారుమంచాల గ్రామంలోని బైరెడ్డినగర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డించే ఆహారపదార్థాల్లో కాస్త కారం తక్కువగా వేసి రుచికరంగా వండిపెట్టాలని, క్రమం తప్పకుండా గుడ్డు, చిక్కీలు అందజేయాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం సర్పంచ్ ప్రకాశం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సర్పంచ్ మాధవరం ప్రకాశం